సాక్షి కర్నూలు

శుక్రవారం । 21 । ఏప్రిల్ । 2023



27న గంగా పుష్కరోత్సవం

మహానంది: గంగానది పుష్కరాలు ఈ నెల 22 నుంచి మే 3వ తేదీ జరగనున్నాయి. ఈ సందర్భంగా మహానందిలో ఈ నెల 27వ తేదీన గంగా పుష్కరోత్సవం నిర్వహించనున్నారు.



గ్యాస్ నిక్షేపాలు

చాగలమర్రి మండలంలో గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్లు ఓఎన్‌జీసీ అధికారి సత్యబాబు తెలిపారు. గురువారం బ్రాహ్మణపల్లె, మద్దూరు పరిసర ప్రాంతాల్లో సర్వే నిర్వహించారు. 8లో



పుణ్య మార్గం.. పేదలకు దానం

రంజాన్ మాసంలో దాన ధర్మాలకు అధిక ప్రాధాన్యత ఉంది. ధనికులే కాదు.. పేదలు సైతం పండుగ చేసుకోవాలన్న ఉద్దేశంతో జకాత్, ఫిత్రా ఇస్తారు. 8లో

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:39	ఉ॥ 4:35
ఆదోని	సా॥ 6:42	ఉ॥ 4:38
నంద్యాల	సా॥ 6:39	ఉ॥ 4:38
ఆత్మకూరు	సా॥ 6:37	ఉ॥ 4:32
బనగానపల్లె	సా॥ 6:42	ఉ॥ 4:32

రంజాన్ వేళలు

హదీస్ వెలుగు :

పవిత్ర రంజాన్ మాసం నేర్పిన ఆధ్యాత్మికత, ఓర్పు, సహనం, దానధర్మాలు, ఆకలి దప్పికల నియంత్రణ పాఠాల స్ఫూర్తిని ఇతర నెలల్లోనూ కొనసాగించండి. – పవిత్ర ఖురాన్

కొత్త బంగారు లోకం!

- ఈ నెల 22, 23 తేదీల్లో అక్షయ తృతీయ
- హెచ్‌యుఐడీ నంబర్లతో ఆభరణాలు సిద్ధం
- ఆకట్టుకుంటున్న నూతన డిజైన్లు
- ఆఫర్లు ప్రకటిస్తున్న దుకాణదారులు
- పుత్తడి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నప్రజలు

అక్షయ తృతీయ.. ఈ రోజున బంగారం కొంటే లక్ష్మి ఇంటికి వచ్చినట్లేనని, సంపద వృద్ధి చెందుతుందనే నమ్మకం ప్రజల్లో ఉంది. మధ్యతరగతి కుటుంబీకులు మొదలు కొని ఉన్నతస్థాయి ప్రజల వరకు అనేక మంది ఈ రోజున ఎంతో కొంత బంగారం కొనడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నెల 22, 23 తేదీల్లో అక్షయ తృతీయ ఉండటంతో బంగారు దుకాణాలు కొనుగోళ్లను పెంచుకునేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందుకోసం ఆఫర్లు ప్రకటిస్తున్నాయి.

కర్నూలు(అగ్రికల్చర్): పసిడి పండుగకు రంగం సిద్ధమైంది. ఈ నెల 22వ తేదీతోపాటు 23 కూడా అక్షయ తృతీయ ఉండటంతో పుత్తడి వ్యాపారులు నూతన డిజైన్లను అందుబాటులో ఉంచారు. కొన్ని దుకాణాలు ఆఫర్లను ప్రకటించగా..మరికొన్ని అడ్వాన్స్ బుకింగ్ సౌకర్యాన్ని తెరపైకి తీసుకొచ్చాయి. బంగారం కొనుగోలు సమయంలో వినియోగదారులు మోసపోకుండా కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. రెండు గ్రాముల పైబడి కొనుగోలు చేసే బంగారం ఆభరణాలలో హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్(హెచ్‌యుఐడీ) ఆరు అంకెల నంబరు విధిగా ఉండాలనే నిబంధన పెట్టింది. ఇంతవరకు బీఐఎస్ హాల్‌మార్క్ గుర్తు ఉన్న ఆభరణాలను 916 ప్యూరిటీ నగలుగా వ్యవహించడం జరిగేది. అయితే నకిలీ హాల్‌మార్క్‌తో వినియోగదారులను మోసం చేస్తుండటంతో కేంద్ర ప్రభుత్వం హాల్ మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ విధానాన్ని తీసుకొచ్చింది. ఆభరణాలపై 22 కేరెట్ల బంగారం అయితే 22కే 916 మార్క్, పక్కన ఆరు అంకె యూనిక్ ఐడీ ఉంటుంది. ఈ ఐడీ ఆధారంగా ఆభరణాలు ఎక్కడ తయారయ్యాయో తెలుసుకోవచ్చు. ఆభరణాలు 20 కేరెట్లు అయితే 20కే 833 అని, 18 కేరెట్లు అయితే 18కే750 అని ఉంటుంది.



ఆభరణాలపై ఉండే యూనిక్ ఐడీ గుర్తు



కర్నూలులోని ఓ దుకాణంలో ఆభరణాలు కొనుగోలు చేస్తున్న యువతి

గతంతో పోలిస్తే పెరిగిన ధరలు..

గతేడాది అక్షయ తృతీయతో పోలిస్తే ఈ సారి బంగారం ధరలు భారీగా పెరిగాయి. గత అక్షయ తృతీయ సమయంలో 22 కేరెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.47,100 ఉంది. ప్రస్తుతం (గురువారం) 10 గ్రాముల బంగారం రూ.55,850 పలుకుతోంది. అంటే 10 గ్రాములపై రూ.8,750 ధర పెరిగింది. అలాగే 24 కేరెట్ల బంగారం ధర రూ.60,700 పలుకుతోంది. ఆభరణాలపై ఎంపిక చేసుకున్న డిజైన్‌ను బట్టి తరుగు 4 నుంచి 22 శాతం వరకు (10 గ్రాములకు రూ. 2234 నుంచి రూ. 12287 వరకు) కలుపుతారు.

బిల్లు లేకపోతే ఇబ్బందులే...

బంగారం కొన్నప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి. బంగారం పోగొట్టుకున్నా.. దొంగలు ఎత్తుకెళ్లినా పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ఇది అవసరమవుతుంది. కార్పొరేట్ దుకాణాల్లో మొత్తం ఆన్‌లైన్‌లో వ్యాపారం జరుగుతుంది. తప్పనిసరిగా బిల్లు ఇస్తారు. కొన్ని దుకాణాలు ఇచ్చే బిల్లులపై పాన్, జీఎస్టీ నంబరు ఇతరత్రా వివరాలు ఉండవు. మరికొందరు తెల్లపేపర్‌పైనే వివరాలు రాసి ఇస్తున్నారు. వివరాలు లేని బిల్లు తీసుకుంటే ఇబ్బందులు ఉత్పన్నం అవుతాయి. తగిన జాగ్రత్తలతో బంగారం కొనాల్సిన అవసరం ఉంది.

హెచ్‌యుఐడీతో ఆభరణాలు సిద్ధం



గతంలో బీఐఎస్ హాల్ మార్క్‌తో బంగారం ఆభరణాల విక్రయాలు జరిగేవి. ఇప్పుడు ప్రతి ఆభరణంపై హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ (హెచ్‌యుఐడీ) ఉంటుంది. చిన్నషాపు మొదలు కొని కార్పొరేట్ దుకాణం వరకు అందరని వద్దా ఇలాంటి నగలే ఉంటాయి. మేం అక్షయ తృతీయను పురస్కరించుకొని ప్రత్యేకమైన ఆఫర్లు, డిస్కౌంట్లను ప్రకటించాం. నూతన డిజైన్లును తీసుకొచ్చాం.

–ఫయాజ్, బంగారు వ్యాపారి



అక్షయ తృతీయ అమ్మకాలకు సిద్ధంగా వివిధ రకాల ఆభరణాలు

మగువలకు పసిడి అంటే ఎనలేని మమకారం. ఎన్ని ఆభరణాలు ధరిస్తే అంత అందం, హుందాతనం వస్తుందని వారి నమ్మకం. మహిళలను ఆకట్టుకునే విధంగా వ్యాపారులు నూతన డిజైన్లను సిద్ధం చేశారు. వడ్డాణాలు, గాజులు, చైన్‌లు, నక్లెస్‌లే కాకుండా డైమండ్స్, యాంటిక్ జ్యువెలరీ, రూబీ ఎమరాల్డ్ కాస్టింగ్, టెంపుల్ జ్యువెలరీ, ఫ్యాషన్ జ్యువెలరీ, రాజ్‌కోట్ లైట్‌వెయిట్ జ్యువెలరీ, కలకత్తా ఎనామిల్ వర్క్ డిజైన్‌లు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వెయ్యి వరకు దుకాణాలు ఉండగా అక్షయ తృతీయ రోజు రూ. 100 కోట్ల వరకు వ్యాపారం జరిగే అవకాశం ఉంది. మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసేందుకు వీలుగా బరువు తక్కువగా ఉండే ఆభరణాలను అందుబాటులో ఉంచారు. అలాగే గ్రాము మొదలు కొని 100 గ్రాముల బంగారు నాణేలను కూడా సిద్ధం చేశారు. డిమాండ్‌కు తగ్గట్టుగా అమ్మకాలు చేపట్టడానికి వ్యాపారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు.

నాణేలు సిద్ధం..

ధరలు పెరిగినప్పటికీ కొనక తప్పదు



ధరలు పెరిగినప్పటికీ అవసరమైన సందర్భాల్లో బంగారం కొనక తప్పదు. అక్షయ తృతీయను పురస్కరించుకుని బంగారు ఆభరణాల డిజైన్లను పరిశీలించేందుకు దుకాణానికి వచ్చాం. నూతన డిజైన్లు బాగున్నాయి. అవసరాన్ని బట్టి కొనుగోలు చేస్తున్నాం.

– వేణుప్రియ, పద్మావతి, ఎ.క్యాంప్, కర్నూలు

కొత్త రైతులకు వైఎస్ఆర్ రైతుభరోసా

కర్నూలు(అగ్రికల్చర్): 2023–24వ సంవత్సరానికి సంబంధించి వైఎస్సార్ రైతుభరోసా కింద పెట్టుబడి సాయం పొందడానికి కొత్త రైతులు రైతుభరోసా కేంద్రాలను సంప్రదించాలని వ్యవసాయ అధికారులు స్పష్టం చేశారు. కొత్తగా భూములు కొనుగోలు చేసి పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు వైఎస్ఆర్ రైతుభరోసా కోసం సంబంధిత పత్రాలను అందజేయాలన్నారు. మరణించిన వారి నామినీలు కూడా తగిన ఆధారాలతో ఆర్‌బీకేలను సంప్రదించాలన్నారు. ఈ నెల 30లోగా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు వ్యవసాయ సలహా మండలి సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం ఈ నెల 21న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి అధ్యక్షతను జరగనుంది. జిల్లా కలెక్టర్ జి.సృజన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొదటి సమావేశం కావడం విశేషం. జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంతో పాటు వ్యవసాయ అనుబంధ శాఖల పైనా సమీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు సిద్ధమయ్యారు. భూసార పరీక్షలు, ఖరీఫ్ విత్తనాల పరిస్థితి తదితరాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తారు.

24న పశుగణాభివృద్ధి సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కార్యనిర్వాహక సంఘం ఎన్నిక ఈ నెల 24న ఉదయం 10 గంటలకు జరగనుంది. ఉమ్మడి కర్నూలు జిల్లా యూనిట్‌గా కొండారెడ్డిబురుజు సమీపంలోని బహుళార్థ పశువైద్యశాల ప్రాంగణంలోని జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కార్యాలయంలో ఎన్నిక నిర్వహించనున్నారు. భూమా నారాయణరెడ్డి నేతృత్వంలోని కార్యనిర్వాహక సంఘం పదవీ కాలం మార్చి 14న ముగిసింది. నూతన కార్యనిర్వాహక సంఘం, చైర్మన్ ఎన్నికకు జిల్లా కలెక్టర్ జి.సృజన ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల అధికారిగా బహుళార్థపశువైద్య శాల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హేమంత్‌కుమార్‌ను.. ఎన్నికల ప్రక్రియను చేపట్టేందుకు కలెక్టర్ 27 మంది సభ్యులను నియమించారు.

న్యూస్‌రీల్

ఆదోనిలో వడగండ్ల వాన



వడగండ్ల వానకు విరిగిన విద్యుత్ స్తంభం

ఆదోనిటౌన్/ఆదోని అర్బన్: పట్టణంలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో వడగండ్ల వాన కురిసింది. దీంతో న్యూగాంధీనగర్, క్రాంతినగర్‌లో చెట్లు నేలకూలాయి. విద్యుత్ స్తంభాలు విరిగి పడిన వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. లేబర్ కాలనీ, కల్లుబావి, శ్రీసాయినగర్ తదితర ప్రాంతాల్లో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది.

ప్రభుత్వ ధరతో మాజీ సైనికులకు ఇళ్ల స్థలాలు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో మాజీ సైనికులు, ఆ కుటుంబ వితంతువులకు ప్రభుత్వ ధరతో 175 చదరపు గజాల ఇళ్ల స్థలాలను ఇప్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎస్ఆర్ రత్నరూత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సైనిక సంక్షేమ శాఖ సంచాలకులు(విజయవాడ) ఆదేశాల మేరకు స్థలాలు పొందేందుకు ఆసక్తి కలిగిన ఆ కుటుంబ వితంతువులు తమ వివరాలను ఈ నెల 24లోగా తమ కార్యాలయంలో అందజేయాలన్నారు. నెంబర్, ర్యాంక్ పేరు, ఫోన్ నెంబర్, చిరునామా, వయస్సు, రిలేషన్, రెండు జిల్లాల్లో ఏ మండలంలో స్థలం కోరుతున్నారనే వివరాలను తెలపాలన్నారు. మరిన్ని వివరాలకు 08518–229445 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఒకట్రెండు రోజుల్లో తేలికపాటి వర్షం

- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న అధిక ఉష్ణోగ్రతలు



కర్నూలు(అగ్రికల్చర్): రానున్న ఒకట్రెండు రోజుల్లో ఉమ్మడి కర్నూలుజిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇదిలాఉంటే జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. సాయంత్రం 7 గంటల సమయంలో కూడా వడగాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య ఎండలు, వడగాలుల తీవ్రత కారణంగా రహదారులపై రాకపోకలు బాగా తగ్గిపోయాయి. ఎండల తీవ్రత పెరగడంతో శీతల పానీయాలకు డిమాండ్ పెరిగింది. చాగలమర్రిలో 44.18 డిగ్రీలు, పూడూరులో 43.18, నందవరం(బనగానపల్లి మండలం)లో 44.64, మంత్రాలయంలో 44.05 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది.

ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక పర్యవేక్షణ



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

- ప్రతి బుధవారం మండలాలను సందర్శించాలి
- సచివాలయాల సేవలపై విస్తృత ప్రచారం నిర్వహించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో మండలాధికారులను ఆదేశించిన కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మండల ప్రత్యేకాధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన ఆదేశించారు. ప్రతి బుధవారం కేటాయించిన మండలాలకు వెళ్లి అక్కడి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. గురువారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల ప్రత్యేకాధికారులు, మండల స్థాయి అధికారులతో జేసీ నారపురెడ్డి మౌర్యతో కలసి ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మండలాల ప్రత్యేకాధికారులుగా వివిధ శాఖల హెచ్ఓడీలను నియమించామన్నారు. వారు వారంలో ఒకటి లేదా రెండు గ్రామాల్లో పర్యటించాలన్నారు. ముఖ్యంగా స్పందనలో తిరస్కరించిన అర్జీలు రీఓపెన్ అవుతున్నాయని, అందుకోసం సంబంధిత సచివాలయాన్ని సందర్శించి కారణాలను విశ్లేషించాలన్నారు. సచివాలయాల ద్వారా అందుతున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలపై క్షేత్ర స్థాయి పరిశీలన సమయంలో రికార్డుల నిర్వహణ, వాస్తవ పరిస్థితులను గమనించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై కూడా విచారణ చేయాలన్నారు. స్పందనలో రీఓపెన్ అవుతున్న అర్జీల్లో దాదాపు 70 శాతం వరకు అర్జీకేతర సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించడానికి ఉన్న ఇబ్బందులు ఏమిటని ఆమె ప్రశ్నించారు. ప్రతి సచివాలయంలో ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందనను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డిని ఆదేశించారు. పాఠశాలలు తెరచిన తరువాత బడి బయట ఉన్న పిల్లలపై సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్పీలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో సంయుక్త సర్వే చేయించి నివేదిక ఇవ్వాలని డీఈఓ రంగారెడ్డిని ఆదేశించారు. కరోనాతోపాటు ఇతర రోగాల నిర్ధారణ కోసం చేపట్టిన ఫీవర్ సర్వేలో కోసిగి, హాలహర్వి, పెద్దకడబూరు మండలాలు వెనుకబడి ఉన్నాయన్నారు. సచివాలయ హెల్త్ సెక్రటరీ, వలంటీర్ల బృందంలో ఆయా మండలాల్లో వారంలోపు సర్వేను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక గ్రామాధికారిని మండల ప్రత్యేకాధికారులు నియమించుకోవచ్చని సూచించారు. జేసీ ఎస్. మౌర్య మాట్లాడుతూ.. స్పందనలో వచ్చిన అర్జీలకు ఎండార్స్‌మెంట్ ఇచ్చిన విషయం అర్జీదారులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోట్ల కుటుంబం మైండ్ సెట్ మార్చుకోవాలి

- పెద్దాయన పేరును మంటగలిపారు
- 'నారా'ను నమ్ముకుని నట్టేట మునిగారు
- సామంతుల రాజకీయాలకు ప్రజలు చరమగీతం పాడారు
- విలేకరుల సమావేశంలో మంత్రి గుమ్మనూరు జయరాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: తెర వెనుక ఉంటూ ఫ్యాక్షన్ రాజకీయాలు నడిపే మైండ్‌సెట్‌ను కోట్ల కుటుంబం మార్చుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం హితవు పలికారు. ఆలూరులోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తాము ఎంతో మందికి రాజకీయ పదవులు ఇచ్చామని చెప్పుకునే కోట్ల కుటుంబం ఇప్పుడు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌తో కలిసి యువగళం పాదయాత్రలో పాల్గొనడాన్ని చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. మచ్చలేని నాయకుడు, జిల్లా పెద్దాయన కోట్ల విజయభాస్కర్‌రెడ్డి పేరు ప్రతిష్టతలను మంటగలిపారన్నారు. 'నారా'సుర రాజకీయాన్ని నమ్ముకుని కోట్ల కుటుంబం నట్టేముగిపోయిందన్నారు. 2024 ఎన్నికల్లో ఆలూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా కోట్ల సుజాతమ్మ పోటీ చేసినా ఓడి పోవడం తథ్యమని మంత్రి జోస్యం చెప్పారు. గతంలో దొరలు, సామంతులు పాలనను కొనసాగించే వారని, ప్రస్తుతం ఈ విధానానికి ప్రజలు చరమగీతం పాడారని మంత్రి గుర్తు చేశారు. మంచి చేసేవారినే ప్రజలు పాలకులుగా ఎన్నుకుంటున్నారన్నారు. ఆస్పరి మండలం చిన్న హోతూరు గ్రామంలో మిటినా కంపెనీకి చెందిన వంద ఎకరాల వ్యవసాయ భూములు కొన్న విషయం వాస్తమేనన్నారు. పెత్తందారుల చేతుల్లో ఉన్న 430 ఎకరాల భూమిని లాక్కొస్తే తాను కొన్న వంద ఎకరాలను భూమిని రైతులకు మార్కెట్ ధరకే రిజిస్ట్రేషన్ చేయిస్తానని కోట్ల సుజాతమ్మకు మంత్రి సవాల్ విసిరారు. ఆలూరు నియోజకవర్గం నుంచి 2009లో వాల్మీకులు టీడీపీ తరఫున టికెట్ ఆశిస్తే వారి వద్ద డబ్బు లేదని ఇవ్వలేదన్నారు. తాను 2011లో వైఎస్సార్‌సీపీలో చేరానని, 2014లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి గెలిపించారన్నారు. అలాగే 2019లో మళ్లీ టికెట్ ఇచ్చి గెలిపించారని, అలాగే మంత్రి పదవి కూడా ఇచ్చారన్నారు. కోట్ల కుటుంబానికి రాజకీయ విశ్రాంతి అవసరమని అనేక వర్గాలకు చెందిన ప్రజలు కోరుకుంటున్నారని మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బజారప్ప, హాలహర్వి వైస్ ఎంపీపీ నాగేష్, మండల కన్వీనర్ భీమప్ప, గూళ్యం గ్రామానికి చెందిన బొట్టు దుబ్బలింగ, వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు మల్లన్న ఉచిత ఆర్జిత సేవా భాగ్యం

- 25 నుంచి ఉచిత సామూహిక సేవలు ప్రారంభం
- తెల్లరేషన్‌కార్డు కలిగిన భక్తులకు అవకాశం

ఉచిత సామూహిక సేవల వివరాలు

తేదీ	మాసం	విశేషం	సామూహిక ఆర్జిత సేవల పేరు
12-05-2023	జ్యేష్ఠమాసం	శ్రవణ నక్షత్రం	కుంకుమార్చన
12-06-2023	ఆషాఢమాసం	ఆరుద్రనక్షత్రం	మృత్యుంజయహోమం
25-08-2023	శ్రావణమాసం	వరలక్ష్మీవ్రతం	శ్రావణ వరలక్ష్మీ వ్రతములు
18-09-2023	భాద్రపదమాసం	వినాయకచవితి	గణపతి పూజ
27-10-2023	ఆశ్వీయుజమాసం	చతుర్దశి, శుక్రవారం	చండీహోమం
30-11-2023	కార్తీకమాసం	ఆరుద్రనక్షత్రం	శ్రీస్వామిఅమ్మవార్ల కల్యాణం
27-12-2023	మార్గశిరమాసం	ఆరుద్రనక్షత్రం	మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం
25-01-2024	పుష్యమాసం	పుష్యశుద్ధ పౌర్ణమి (వార్షిక ఆరుద్రోత్సవం)	రుద్రహోమం
16-02-2024	మాఘమాసం	మాఘశుద్ధ సప్తమి (రథ సప్తమి)	శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం

శ్రీశైలంటెంపుల్: రాష్ట్రంలో రేషన్‌కార్డు కలిగిన భక్తులకు శ్రీశైల దేవస్థానం శుభవార్త చెప్పింది. ధర్మ ప్రచారంలో భాగంగా ప్రతిమాసంలో ఒకసారి సామాన్య భక్తుల కోసం నెలలో ఒకరోజున ఉచిత సామూహిక ఆర్జిత సేవలను మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టింది. ఆర్థికంగా వెనుకబడిన భక్తుల సౌకర్యార్థం ఈ సదుపాయాన్ని కల్పిస్తుంది. ఈ నెల 25వ తేదీ నుంచి ఉచిత సామూహిక ఆర్జిత సేవలను ప్రవేశపెట్టనుంది. శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు జరిగే నిత్య ఆర్జితసేవలను ఆర్థికంగా వెనుకబడిన సామాన్య భక్తులు చేసుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో సామాన్య భక్తుల సౌకర్యార్థం దేవస్థానం తెల్లరేషన్‌కార్డు కలిగిన భక్తులకు ప్రతి నెలలో ఒక రోజు స్వామిఅమ్మవార్లకు నిర్వహించే ఆర్జిత సేవను ఉచితంగా నిర్వహించుకునేలా భక్తులకు అవకాశం కల్పించింది. ఈ నెల 25వ తేది నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతుంది. ఈ నెల 25న ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం 9.30 గంటలకు చంద్రవతి కల్యాణమండపంలో మల్లికార్జున స్వామికి సామూహిక అభిషేకాన్ని నిర్వహించనున్నారు. భక్తులు ఉచిత సామూహిక సేవలో పాల్గొనేందుకు టికెట్లను బుక్ చేసుకునేందుకు టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. ఈ సేవలను శ్రీశైల టీవీ ద్వారా కూడా వీక్షించవచ్చు.

టికెట్లు ఇలా పొందాలి

ప్రతి నెలలో 250 టికెట్లు మాత్రమే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. ఈ సేవలో దంపతులు లేదా ఒకరు పాల్గొనవచ్చు. సేవాకర్తలు తప్పనిసరిగా తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉండాలి. ఆన్‌లైన్ ద్వారా సేవ నమోదు చేసుకునే సమయంలో భక్తులు వారి తెల్లరేషన్‌కార్డు స్కానింగ్ చేసి అప్‌లోడ్ చేయాలి.

దర్శనం

సామూహిక అభిషేకానంతరం ప్రత్యేక క్యూలైన్ ద్వారా మల్లికార్జున స్వామివారి అలంకార దర్శనం, భ్రమరాంబాదేవి అమ్మవారి దర్శనంతో పాటు వృద్ధ మల్లికార్జున స్వామివారి స్పర్శదర్శనం కల్పించబడుతుంది. సేవాకర్తలకు 2 లడ్డూ ప్రసాదాలు, కుంకుమ, విభూతి, కైలాస కంకణాలు, శ్రీశైలప్రభ, కాటన్ కండువా, రవిక వస్త్రం అందజేస్తారు. దర్శనం అనంతరం దేవస్థానం అన్నదాన భవనంలో భోజన సదుపాయం కల్పించబడుతుంది.

బీసీ కుల గణన చేపట్టాలి

- కేంద్రంలో బీసీ ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి
- చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి
- రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య



శ్రీశైలాలయ ధ్వజ స్తంభాన్ని దర్శించుకుంటున్న ఆర్ కృష్ణయ్య

శ్రీశైలంటెంపుల్: కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనాభా గణనలో బీసీ కులగణన చేపట్టాలని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఆయన దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామి వారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో ఆర్.కృష్ణయ్యకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఏఈవో స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీశైలం వచ్చిన కేంద్ర సాంఘిక న్యాయ, ఎంపవర్‌మెంట్ శాఖా మంత్రి వీరేంద్రకుమార్‌ను కలిసి బీసీల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశానని తెలిపారు. 75 ఏళ్లుగా బీసీలను కాంగ్రెస్ పార్టీ, బీజేపీ మోసం చేశాయని విమర్శించారు. బీసీని ప్రధానమంత్రిని చేసిందని బీజేపీ చెప్పుకోవడం తప్పా బీసీలకు ఎలాంటి న్యాయం చేయ లేదని విమర్శించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి, చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, బీసీల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి ప్రత్యేక పథకాలు, కేంద్ర స్థాయిలో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపాధి రంగంలో శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలని, సుప్రీం, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ ఫెడరేషన్ ఫ్రంట్ అధ్యక్షులు జి.మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పుణ్య మార్గం.. పేదలకు దానం

- రంజాన్‌లో దానధర్మాలకు అధిక ప్రాధాన్యత
- ఈద్‌కు ముందు రోజు ఫిత్రా ఇవ్వడం ఉత్తమం
- ఫిత్రాల పండుగే ఈదుల్ ఫితర్
- నేడు జుమ్మతుల్ విదా





కర్నూలు(రాజ్‌విహార్): రంజాన్ మాసంలో దాన ధర్మాలకు అధిక ప్రాధాన్యత ఉంది. ధనికులే కాదు.. పేదలు సైతం పండుగ చేసుకోవాలన్న ఉద్దేశంతో జకాత్, ఫిత్రా ఇస్తారు. 52.50 గ్రాముల వెండి లేదా 75 గ్రాముల బంగారం లేదా అంత విలువైన ధన/ఆస్తులు కలిగి ఉన్న ప్రతి ముస్లిం జకాత్‌కు అర్హుడు. తమ సొమ్మును లెక్కకట్టి అందు లోంచి 2.5 శాతం పేదలకు పంచాలి. అలాగే సాధా రణ స్థితిలో ఉన్న ప్రతి ముస్లిం 1,750 గ్రాముల గోధుమలు, లేక సమానమైన డబ్బు పేదలకు దానం చేయడమే ఫిత్రా.

70 రెట్ల పుణ్యం

కలిమా, నమాజ్, రోజా, జకాత్, హజ్ అనేవి ఇస్లాం కు మూల స్తంభాలు. జకాత్ ఇచ్చిన వారి సొమ్మును అల్లాహ్ రక్షించడమే కాకుండా వృద్ధి చేస్తారని మౌలీ వ్లు చెబుతున్నారు. జకాత్ ఇచ్చే వారికి సాధారణ రోజుల్లో కంటే రంజాన్‌లో 70 రెట్ల పుణ్యం అధికం గా లభిస్తుందని, పరలోకంలోనూ లాభం చేకూ ర్చుతుందని ముస్లింల విశ్వాసం. జకాత్ ఇవ్వడం వల్ల సమాజంలో ఆర్థిక అసమానతలు తొల గిపోతాయి. జకాత్ ఇవ్వని, రోజా ఉండని వ్యక్తిలో వ్యాపార ఆలోచన ఏర్పడుతుందని, తనకే లాభం చూసుకుని, ఇతరుల బాధలు పట్టించుకోరని, ఇది ఇస్లాంకు వ్యతిరేకమని మౌల్వీలు చెప్పారు.

పేదలందరూ పండుగ చేసుకునేలా..

పేదరికంతో పండుగకు నోచుకోని అభాగ్యులకు ఫిత్రా ఇవ్వాలి. సద్‌ఖా–ఎ–ఫిత్రా ఇచ్చిన వారు అల్లాహ్ రక్షణ వలయంలో ఉంటారు. రంజాన్ రోజాల్లో ఏవైనా లోపాలుంటే సవరిస్తారు. ఈద్‌కు ఒక రోజు ముందుగానే ఫిత్రా చెల్లిస్తే పేదలు పం డుగ చేసుకునే వీలుంటుంది. నెలంతా రోజాలు ఉండి, ఫిత్రా చెల్లిస్తుండడంతో ఈ పండుగకు 'ఈదుల్ ఫిత్ర్' అనే పేరొచ్చిందని మౌల్వీలు తెలిపారు.


అల్లాహ్ మెచ్చే అద్భుత ప్రార్థన నమాజ్

అల్లాహ్ మెచ్చే, అమితంగా ఇష్టపడే ప్రార్థనల్లో నమాజ్ మొదటి వరుసలో ఉంటుంది. ఇస్లాం స్వీక రించిన ప్రతి ఒక్కరిపై మొదటి నియమం నమాజ్. రోజుకు ఐదు పూటలా ఫరజ్ ఉంది. మహమ్మద్ ప్రవక్త పాటించిన సున్నత్ నమాజ్‌లతో పాటు స్వయంగా శక్తి కొలది చేసుకునే నఫిల్ నమాజ్‌లు ఉన్నాయి. రంజాన్‌లో ఒక ఫరజ్ నమాజ్ చేస్తే 70 చేసినట్లు, ఒక నఫిల్ చదివితే ఫరజ్ చేసిన పుణ్యం లభిస్తుందని మౌల్వీలు చెబుతున్నారు.

నేడు జుమ్మతుల్ విదా

రంజాన్‌లో శుక్రవారానికి ప్రత్యేక అనుబంధ ఉంది. సాధారణంగా శుక్రవారం అంటే ముస్లింలు చిన్న పండుగలా భావిస్తారు. అలాంటిది తొలి రోజా శుక్ర వారంతో ప్రారంభంగా చివరి రోజా శుక్రవారం జుమ్మ తుల్ విదాతో ముగిస్తోంది. దీంతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు మసీదుల్లో ఏర్పాట్లు చేశారు.

ధన, ఆరోగ్య బీమా జకాత్



మనిషి ఆరోగ్యం, ధన సంప దల బీమా జకాత్. ఏడాదికి ఒకసారి తన సంపద, నిర్ణీత వెండి, బంగారం విలువపై 2.50 శాతం లెక్క చేసి నగదు ఇవ్వాలి. ముందు తమ రక్త సంబంధీకులు, బం ధువుల్లో ఎవరైనా పేదలు ఉంటే వారికి ఇవ్వడం ఉత్తమం. పేదోళ్లు సైతం పండుగ చేసుకునేలా ఫిత్రా ఇవ్వాలి.

– ముఫ్తీ షేక్ అబ్దుర్ రహిమాన్, నందికొట్కూరు.

జకాత్ తప్పనిసరి



ప్రతి ముస్లిం జకాత్, ఫిత్రా ఇవ్వడం తప్పనిసరి. ఇస్లాంలో జకాత్ ఇవ్వడం ఫరజ్. పంచ నియమాల్లో ఇది ఒకటి. దీని వల్ల అల్లాహ్ వారి ఆరోగ్యాలను కాపాడడంతో పాటు సిరి సంపదను వృద్ధి చేస్తారు. ఫిత్రా ఈద్ కంటే ముందే లేదా నమాజ్ కంటే ముందే చెల్లిస్తేనే అల్లాహ్ రోజాలు అంగీకరిస్తారు.

– ఎస్. డాక్టర్ మొహమ్మద్ అలీ, కార్డియాలజిస్టు

ఉచిత కంటి వైద్యశిబిరం



ఫ్యామిలీ కోర్టు జడ్జి ప్రతిభాదేవికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

కర్నూలు(లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు ప్రారంభించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్యురాలు తిరుప తమ్మ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన వడదెబ్బ



మృతుడు చిన్న రామాంజనేయులు (ఫైల్)

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని హోసూరు గ్రామానికి చెందిన ఉపాధి కూలీ ఒడుగూరు చిన్న రామాంజనేయులు (52) వడదెబ్బతో గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 18న గ్రామంలో ఉపాధి పనులకు వెళ్లిన చిన్నరామాంజి నేయులు అక్కడే సొమ్మసిల్లి పడిపోయాడు. చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడే కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య రం గమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

క్లుప్తంగా

23న గురుకుల ప్రవేశ పరీక్ష

కర్నూలు(అర్బన్): గురుకుల విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశా లకు సంబంధించి ఈ నెల 23న రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లాలో 8, నంద్యాల జిల్లాలో 6 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 23వ తేదిన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 5వ తరగతికి.. ఇంటర్మీ డియట్ విద్యార్థులకు అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు.

వెటర్నరీ డాక్టర్, డ్రైవర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అగ్రికల్చర్): డాక్టర్ వైఎస్సార్ మొబైల్ అంబులెన్స్ వెటర్నరీ క్లినిక్(ఎంఏవీసీ) నుంచి డోన్‌కు వెటర్నరీ డాక్టర్ పోస్టు, సంజా మలలో డ్రైవర్ పోస్టు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఈఎం ఆర్ఐ జీహెచ్ఎస్ ఎగ్జిక్యూటివ్ రామకృష్ణగౌడు తెలిపారు. డాక్టర్ పోస్టుకు బీవీఎస్ లేదా ఎంవీ ఎస్సీ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొ న్నారు. విశ్రాంత వెటర్నరీ అసిస్టెంటు సర్జన్‌లు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. నెలకు రూ.40వేల వేతనం, 12 శాతం పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం ఉంటుందని తెలిపారు. సంజామలలో డ్రైవర్ పోస్టుకు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి, 36 ఏళ్లలోపు, 10వ తరగతి చదవిన వారు అర్హులని తెలిపారు. వేతనం రూ.10,800 ఉంటుందని, రూ.1,600 పీఎఫ్, ఈఎస్ఐ ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 9652533554, 76708 09233 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

యువతి అదృశ్యం

బనగానపల్లెరూరల్: పలుకూరు గ్రామానికి చెందిన దూదేకుల మౌనిక(20) వారం రోజులుగా కనిపిం చడం లేదని కుటుంబీకులు గురువారం పోలీసులను ఆశ్రయించారు. నందివర్గం స్టేషన్ ఎస్ఐ రామాంజనే యరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పలుకూరు గ్రామా నికి చెందిన చిన్నహుస్సేని కూతురు మౌనిక కడపలో బీఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీ వల ఇంటికొచ్చిన ఆమె ఈనెల 14వ తేదీన తన జేజి నాయన ఇంటికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యులు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువతి వివరాలు తెలిస్తే 91211 01098కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు.



యంత్రంతో వరి కోత దృశ్యం.



యంత్రం నుంచి ధాన్యం పడుతున్న దృశ్యం

వరి కోతలు ముమ్మరం

దొర్నిపాడు: కేసీ కెనాల్, కుందూలో ఈ ఏడాది సాగునీరు పుష్కలంగా ఉండటంతో రబీలో వరి సాగు చేసిన రైతుల పంట పండింది. వాతావరణం అనుకూలించడంతో మంచి దిగుబడులు వస్తు న్నాయి. మండలంలో కుందూ కింద క్రిష్టిపాడు, కేసీ కెనాల్ పరిధిలో అమ్మిరెడ్డినగరం, దొర్నిపాడు, అర్జు నాపురం, కొండాపురం, రామచంద్రాపురం గ్రామాల్లో 694 ఎకరాల్లో వరిని సాగు చేశారు. ఎక రానికి రూ.6వేల కౌలు, 25వేల వరకు పెట్టుబడి వెచ్చించారు. ప్రస్తుతం వరి కోతలు యంత్రాల ద్వారా ముమ్మరంగా సాగుతున్నాయి. బస్తా వడ్ల ధర రూ.1,500 పైగా ఉంది. పంట కూడా ఖరీఫ్ పంటలాగా సుమారు 4 అడుగులకు పైగా పెరగడం , కంకికి వడ్లు గుత్తులుగా కాయడంతో ఆశించిన మేర దిగుబడి చేతికందుతోంది. అలాగే ఎకరం గడ్డి రూ.2వేల నుంచి 3వేల వరకు ధర పలుకుతోంది. వరి కోత మిషన్‌కు గంటకు రూ.2,800 వరకు వసూలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

అనుమానంతో దారుణం

- భార్యను చంపిన భర్త

బనగానపల్లె: యనకండ్ల గ్రామంలో కె.మాధవి (32) అనే మహిళను అనుమానంతో భర్త నాగప్రసాద్ దారుణంగా హత్య చేశాడు. బనగానపల్లె సీఐ సుబ్బరాయుడు తెలిపిన వివరాల మేరకు.. అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన నాగప్రసాద్ యనకండ్ల గ్రామానికి చెందిన క్రిష్టయ్య, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె కె.మాధవిని 15 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. నాగప్రసాద్ యనకండ్ల గ్రామంలోనే క్లీనర్‌గా పని చేస్తున్నాడు. కొంత కాలం నుంచి భార్యపై అనుమానంతో అప్పుడప్పుడు ఆమెతో ఘర్షణ పడేవాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న మాధవిపై పదునైన మారణాయుధంతో దాడి చేశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. వెంటనే నాగప్రసాద్ అక్కడి నుంచి పారిపో యాడు. గురువారం ఉదయం కుటుంబీకులు బనగానపల్లె పోలీసులకు సమాచారం ఇచ్చారు. డోన్ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, బనగానపల్లె సీఐ సుబ్బరాయుడు, నందివర్గం ఎస్ఐ రామాంజనేయరెడ్డి గ్రామానికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగా నపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మంత్రాలయం రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మంత్రాలయం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కల్లుదేవకుంట గ్రామానికి చెందిన చాకలి చిన్నరాముడు(63) గురువారం తెల్లవారుజామున 3 గంటల సమ యంలో గ్రామ శివారులో వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీం తో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. చిన్నరాముడికి మతిస్థిమితం లేకపోవ డంతో రాత్రి పూట ఒంటరిగా బయట వచ్చిన మృత్యువాత పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బరితెగించిన చైన్‌స్నాచర్లు

- బేతంచెర్ల, డోన్ పట్టణాల్లో చోరీలు



సీసీ కెమెరాలో అనుమానితులు

బేతంచెర్ల/డోన్ టౌన్: చైన్‌స్నాచర్లు బరితెగిం చారు. మహిళల మెడలోని బంగారు చైన్లను అప హరించారు. బేతంచెర్ల పట్టణం 2వ అంగన్‌వాడీ కేంద్రంలో వర్కర్‌గా పనిచేస్తున్న మధురవాణి గురువారం మధ్యాహ్నం శేషారెడ్డి నగర్‌లో ఉన్న 1వ సచివాలయం వద్దకు వెళ్లి వస్తుండగా ఓ యువకుడు అటకాయించాడు. ఆమెపై దాడి చేసి మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు చైన్ లాక్కొని పరారయ్యాడు. స్పృహ తప్పి కింద పడిపోయిన ఆమెను స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ చేసి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ శివ శంకర్ నాయక్ తెలిపారు.

డోన్ పట్టణంలో..

పట్టణంలోని కేవీఎస్ కాలనీలో ఇంటి ఎదుట పూల మొక్కలకు పద్మావతి అనే మహిళ నీరు పెడుతుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైకుపై వచ్చి ఐదు తులాల బంగారు చైన్ లాక్కెళ్లారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన చోటు చేసుకున్న ప్రాంతంలో సీసీ కెమెరాలను పరిశీలించారు. అనంతపురంలో చైన్ స్నాచింగ్ చేసి డోన్, బేతంచెర్లలో కూడా చైన్‌స్నాచింగ్‌కు పాల్పడినట్లు పోలీ సుల నిర్ధారణకు వచ్చారు. కేసును పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నట్లు సీఐ శేషయ్య తెలిపారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయంరూరల్: శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి బెంగళూరు నగరానికి చెందిన మల్లాటి రూ.1,00,002 విరాళం గా అందజేసినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు తెలిపారు. దాతకు శ్రీమఠం అధికారులు శేషవస్త్రం, పరిమళ ప్రసాదం, ఫలమంత్రాక్షితలు అంద జేశారు.

చాగలమర్రి మండలంలో గ్యాస్ నిక్షేపాలు

ఆళ్లగడ్డ: చాగలమర్రి మండలంలో గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్లు ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్‌జీసీ) సమాచార అధికారి సత్యబాబు తెలి పారు. గురువారం చాగలమర్రి మండలం బ్రాహ్మణపల్లె, మద్దూరు పరిసర ప్రాంతాల్లో సర్వే నిర్వహించినట్లు చెప్పారు. బోర్లను తవ్వగా గ్యాస్ నిక్షేపాలు కనిపించాయన్నారు. వైఎస్సార్‌జిల్లా పెద్ద ముడియం, మైదుకూరు, జమ్మలమడుగు, రాజు పాలెం మండలాల్లోనూ నిక్షేపాలు ఉన్నట్లు సర్వేలో తేలిందన్నారు. ఇప్పటి వరకు 500 నుంచి 700 వరకు బోర్లు వేశామని, 50 అడుగుల లోతులో నిక్షేపాలు గుర్తించామని చెప్పారు. వివరాలను డెహ్రాడూన్‌లోని ఓఎన్‌జీసీ కేంద్ర కార్యాలయానికి పంపించామని తెలిపారు. గ్యాస్ నిక్షేపాల కోసం 2018లో హెలికాప్టర్, ఎయిర్ క్రాఫ్టలతో సర్వే నిర్వ హించామన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసం

- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

అవుకు: ఉద్యోగం ఇస్తామని మోసం చేసిన ఘటన గురువారం వెలుగు చూసింది. పోలీసులు తెలి పిన వివరాల మేరకు.. అవుకు మండలం చెర్లోపల్లె గ్రామానికి చెందిన కరుణాకర్ రెడ్డి, కోవెలకుంట్ల పట్టణానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ రంగమ్మ, దుబ్బా గోవిందరెడ్డి అనే ముగ్గురు కలిసి తమకు విజయవాడలో మంచి పలుకుడి ఉందని, సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని ప్యాపిలి మండలం మాధవరం గ్రామానికి చెం దిన తుగ్గలి వంశీకృష్ణకు మాయమాటలు చెప్పి నమ్మించారు. అతనికి హోంగార్డు జాబ్ ఇప్పి స్తామని చెప్పి ఆరు నెలల కిందట ఈ ముగ్గురు రూ.6 లక్షలు తీసుకున్నారు. అంతకుముందు వం శీకృష్ణ చిన్నమ్మ అయిన చెర్లోపల్లె గ్రామానికి చెం దిన శివమ్మ నుంచి రూ.3లక్షలు తీసుకున్నారు. ఆరు నెలలు గడిచినా ఎలాంటి ఉద్యోగ విషయం తెలపకపోవటంతో మోసపోయి నట్లు గుర్తించి బాధితుడు అవుకు పోలీస్ స్టేష న్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు.

త్వరలోనే ఉపాధ్యాయ బదిలీలు

- ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి



ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కర్నూలు(సిటీ): రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే ఉపాధ్యాయుల బదిలీలను చేపట్టనున్నట్లు పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామ చంద్రారెడ్డి తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత మొదటిసారి గురువారం ఆయన కర్నూలు వచ్చారు. మాంటిస్సోరి హైస్కూల్‌లో జరుగుతున్న పదో తరగతి మూల్యాంకన కేం ద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం సమ స్యల పరిష్కారం కోసం ఆయనకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం పెండింగ్ డీఏలు త్వరలో విడుదల చేస్తుందని ఎమ్మెల్సీ చెప్పారు. ఎన్నికల్లో తన గెలు పుకు సహకరించిన ఉపాధ్యాయులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రైవేటు అన్ ఎయిడెడ్ యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీనివాసరెడ్డి, వాసుదేవయ్య, సాయి సుబ్బయ్య విద్యాసంస్థల అధినేత సుబ్బయ్య, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, వైస్ చైర్మన్ వంశీ, పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.కరుణానిధి మూర్తి, నంద్యాల, కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారెడ్డి, రామకృష్ణ, వివిధ ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

ఫెర్టిలిటీ సెంటర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



స్కానింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని ఫెర్టిలిటీ సెంటర్లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డీఎం హెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య ఆదేశించారు. గురు వారం నగరంలోని ఆదిత్య టెస్ట్ ట్యూబ్ బేబీ సెం టర్, విష్ణుప్రియ టెస్ట్ ట్యూబ్ సెంటర్లను ఆయనతో పాటు ఏఆర్‌టీ ఇన్‌స్పెక్షన్ టీమ్ మెంబర్స్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు కేంద్రాలు అసిస్టెడ్ రీ–ప్రొడక్టివ్ టెక్నాలజీ(ఏ ఆర్‌టీ) అండ్ సరోగసీ యాక్ట్ 2021 నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేశాయ న్నారు. ఈ కేంద్రాలను జిల్లాస్థాయి ఇన్‌స్పెక్షన్ టీమ్ పరిశీలించి అనంతరం అర్హత కలిగిన కేంద్రాలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీ చేసేందుకు జిల్లాస్థాయి ఏఆర్‌టీ కమిటీకి పంపిస్తామన్నారు. జిల్లాస్థాయి ఏఆర్‌టీ కమిటీ ఆమోదం తర్వాత రిజిస్ట్రేషన్ సర్టిఫి కెట్ జారీ చేస్తామని వివరించారు. ఇకపై ఏఆర్‌టీ క్లినిక్‌లు, ఫెర్టిలిటీ కేంద్రాలు తప్పక రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇందుకోసం ఏఆర్‌టీ నేషనల్ పోర్ట ల్‌లో దరఖాస్తును పూర్తి చేసి సమర్పించిన అనం తరం ప్రింట్ తీసి ప్రతి పేజీలో సంతకం, సీల్ వేసి ప్రభుత్వం నిర్దేశించిన మొత్తాన్ని బ్యాంకు డీడీ ద్వారా చెల్లించి దరఖాస్తును డీఎంహెచ్‌ఓ కార్యాల యంలో అందజేయాలని తెలిపారు. ఈ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఐదేళ్లకోసారి రెన్యువల్ చేసుకోవాల్సి ఉం టుందన్నారు. ఈ కార్యక్రమంలో గైనకాలజీ హెచ్ ఓడీ డాక్టర్ వెంకటరమణ, రేడియాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ రాధారాణి, ఎన్‌జీఓ డాక్టర్ బాలమద్దయ్య, డెమో శ్రీనివాసులు, సోషియాలజిస్ట్ భారతి తది తరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటును అడ్డుకుంటే చర్యలు

- ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

నందికొట్కూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటును అడ్డుకుంటే చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయనతో పాటు శాప్ జిల్లా కో ఆర్డినేటర్ స్వామిదాసు రవికుమార్, మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఆర్డీఓ మిరియాల దాసు, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ కిషోర్, సీఐలు విజయభాస్కర్, సుధాక ర్‌రెడ్డి, ఎస్ఐ ఎన్వీ రమణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి యాట ఓబులేసు తదితరులు సీఎస్ఐ పాలెం వద్ద ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ మాట్లా డుతూ విగ్రహం ఏర్పాటుకు అడ్డంకులు సృష్టిం చిన వ్యక్తి ఆ భూమిని విక్రయించడానికి వీలులేదని తేల్చి చెప్పారు. స్థలం ఆర్అండ్‌బీ పరి ధిలోనిదని బోర్డు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కొణిదేల గ్రామంలో ప్రభుత్వ స్థలంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తుంటే కొందరు అడ్డుకున్న సంఘటనపై ఆర్డీఓ, తహసీల్దార్, పోలీసులు స్పందించి పరిష్కారించా లన్నారు. మిడుతూరు మండలం వీపనగండ్ల గ్రామంలో దళితుల మధ్య నెలకొన్న రోడ్డు సమ స్యను పరిష్కరించి కలిసిమెలిసి ఉండేలా పోలీ సులు జోక్యం చేసుకోవాలని స్పష్టం చేశారు. అంబే డ్కర్ విగ్రహాల ఏర్పాటుకు అడ్డంకులు సృష్టిస్తే రెవెన్యూ, పోలీసులు అధికారులు వెంటనే స్పందిం చి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట కౌన్సిలర్లు చెరుకు సురేష్, లాలు ప్రసాద్, చిన్న రాజు వార్డెన్ మహేష్, వైఎస్సార్‌సీపీ నాయ కులు రమేష్, కుల సంఘాల నాయకులు నగేష్, మనోహర్, డాక్టర్ రాజు, శీలం శేషు, రాజు, చరణ్, తదితరులు ఉన్నారు.